# క ట్టు క థ

ఒకరోజు ఆశీర్వాదం కట్టెలు కొట్టుకురావటానికి బండి కట్టుకుని అడవికి వెళ్ళాడు. అడవి మధ్యకు చేరగానే ఒక పెద్దపులి అరుపు వినిపించింది. ఎడ్లు భయంతో బిగిసిపోయినై. వెంటనే ఒక పెద్దపులి ఎదురుగా పరిగెత్తుకురావటం కనిపించింది ఆశీర్వాదానికి. ఆ పెద్దపులి అరుపుల ధ్వనిని బట్టి, నడక పద్ధతినిబట్టి అది గుండుదెబ్బతిన్న పులి అని గ్రహించాడు ఆశీర్వాదం. కంగారుపడి ప్రయోజనం లేదని ఎడ్లు బెదిరిపోకుండా వాటి తలత్రాళ్లు లాగిపట్టుకుని తొట్టిలో కదలకుండా మెదలకుండా కూర్చున్నాడు ఆశీర్వాదం.

పెద్దపులి తూలుతూవచ్చి, బండికి ఎదురుగా నిలబడి, రెండుకాళ్ళ మీదనిలబడి ముందరి కాళ్ళుజోడించి, "నన్ను రక్షించాలి" అని మ్రొక్కింది.

ఆశ్వీర్వాదం చూశాడు. పులికి రొమ్ముల్లో గుండుదెబ్బ తగిలివుంది ఆ దెబ్బనుంచి రక్తం జల జల ప్రవహిస్తూవుంది. ఎక్కువ రక్తం కారిపోవటంవల్ల కాబోలు పులి కాళ్ళమీద నిలవలేకపోతూవుంది. ఆ నిలబడిన పులిని చూసేటప్పటి అతనికి నిజంగా జాలివేసింది.

"ఏం చెయ్యమంటావ్?" అని పులిని అడిగాడు.

"వేటగాళ్లు తరుముకు వస్తున్నారు. నన్ను రక్షించాలి. నేను తప్పించుకు పారిపోయే స్థితిలో లేను" అన్నది పెద్దపులి.

"సరే" అన్నాడు అతను పెద్దపులిని తన దగ్గరవున్న గోనెసంచిలో కూరటానికి ప్రయత్నించాడు. కాని దాయటానికి వీలు లేదు ముందు తల దూరిస్తే తోకమిగిలేది; తోకదూరిసే తలమిగిలేది ఇది లాభంలేదనుకొని పులిని తొట్టిలోపడుకోమని, గడ్డితో కనపడకుండా కప్పివేశాడు అతను. ఇంతలో వేటగాళ్లు ఎదురుగా రావటం చూశాడు. వాళ్ల పెదబొబ్బలు

పెట్టుకుంటూ, పులిని వెతుక్కుంటూ వస్తున్నారు. యాధాలాపంగా బండిని తోలాడు అతను.

క్షణంలో వేటగాళ్ళ సమూహం దగ్గరకు వొచ్చింది. అదివారి జమీందారు బృందం.

"నీకు ఒకపులి కనిపించిందా?" అని అడిగాడు జమీందారు.

"పులే?" ఆశ్చర్యాన్ని ప్రకటించాడతను.

"అవును. గుండుదెబ్బతిన్న పులి."

"కనపడలేదే! గుండుదెబ్బతిన్న పులి బళ్ళ దార్న నడవదు.... లోయల్లోకో, గుహల్లోకో వెళ్ళి అలసట తీసుకుంటూ వుండి వుంటుంది. ప్రక్కదార్లకువెళ్ళి వెదకండి...." అన్నాడు.

ఇంత నేర్పరితనంగా చెప్పినా జమీందారు ఆశీర్వాదం మాటలు నమ్మినట్లులేడు. "అయితే నీకు పులి కనపడలేదు అంటావు?" అని అడిగాడు.

"పులి కనబడితే ఎడ్లిట్లా ఉండేవా? ఏ ఏటికో కోటికో లాక్కుపోయి నయ్ యీ పాటికి?" అన్నాడు అతను "తొందరగా వెతకండి.... ఆలస్యం అయితే అసలు కనపడదు" అని చెప్పి ఎడ్లను అదిలించాడు. జమీందారు బృందం పెడబొబ్బలు పెట్టుకుంటూ అతని సలహా ప్రకారం ప్రక్కదారికి తిరిగింది. ఆ కేకలు వినబడేవరకూ, తొట్టిలో గడ్డి కిందవున్న పులి వూరుకుంది. ఆ కేకలు సమసిపోగానే గడ్డిని తొలగదోసుకొని లేచింది. ఆశీర్వాదానికి ఎదురుగా కూర్చొని, "ఆకలి" అన్నది.

"ఇక్కడేం దొరుకుతయ్? వూరు రాని" అన్నాడు అతను.

పులి అతన్ని క్రీగంట చూచింది. "ఊరుదాకా ఆగలేను" అన్నది చప్పరిస్తూ.

"ఆగక చేసేదేముంది? యిక్కడేం దొరుకుతుంది?" అన్నాడు.

"ఎందుకు దొరకదు?" అని పులి చప్పరిస్తూ "మనుష్య మాంసానికి మించిన మాంసం మరొకటిలేదు!"

అతనికి అప్పటికి అర్థం అయింది అది తన్నే తినాలని చూస్తూ వుందని. అకస్మాత్తుగా అప్పుడతనికి అది పులి అనీ, క్రూరజంతువు అనీ జ్ఞాపకం వచ్చింది వెంటనే వొణుకు పుట్టింది. "నీ కిది ధర్మం కాదు. నేనింతకుముందే నీ ప్రాణాలు కాపాడాను. నువ్వు నా ప్రాణాలను తియ్యటానికి పూనుకుంటున్నావు. నీకిది ధర్మంకాదు" అన్నాడు.

"ఆకలి తీర్చుకోవటం కంటే ఉత్తమ ధర్మం ఇంకొకటి లేదు" అన్నది పులి. అంటూ దవ్వరించుకుంటూ ముందుకు జరిగింది. అతను సెవ్వమని క్రిందకు దూకాడు. అతని వెంట పులి దూకింది. ఇద్దరూ వొకరి వెంట వొకరు బండిచుట్టూ తిరగటం మొదలుపెట్టారు. ఎక్కడ కదిలితే, పెద్దపులి దృష్టి తనమీద పడుతుందో అని, ఎడ్లు 'కిమ్మన' కుండా నిలబడి వున్నయ్.

వరిగత్తి వరిగత్తి ఆశీర్వాదం ఇలా అన్నాడు...."ఈ సమస్యను దౌర్జన్యంతో పరిష్కరించుకోవటం సబబుకాదు. వశుబలాన్ని నువ్వు ప్రయోగించి వొకవేళ నన్ను మింగినా నీ ఆత్మ నిన్ను చచ్చేవరకూ వేధిస్తూనే వుంటుంది. ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవటం మనకు మంచిది."

"ఏ విధంగా" అని అడిగింది పులి.

"మనం మధ్యవర్తిత్వానికి అంగీకరిద్దాం....ఈ రోజుల్లో అంతా అనుసరించే మార్గం అదే. ఒక ముగ్గుర్ని అడుగుదాం—'నీ ప్రాణాన్ని రక్షించిన నన్ను నువ్వు భక్షించటం న్యాయమా, కాదా?' అని. వారేం చెబితే అట్లా చేద్దాం. అప్పుడు నువ్వు నన్ను భక్షించినా నీ ఆత్మ వేధించదు" అని చెప్పాడతను.

"సరే, సరే" అన్నది పులి. దానికి ఆత్మ అంటే ఏమిటో తెలియదు. అయినా ఈ లేనిపోయిన వేధింపులెందుకు? అనుకున్నది.

ఇద్దరూ మళ్ళీ బండి ఎక్కారు. బండి ముందుకు సాగింది. కాసేపటికి, "ఒక్కరూ కనబడలేదు. యిక నేను ఆగలేను" అన్నది పులి.

"వొప్పందం వొప్పందమే" అన్నాడు అతను.

"దాన్ని అడుగు" అన్నది పులి, ఎదురుగావున్న పెద్దచెట్టుని చూస్తూ.

"అది చెట్టు" అన్నాడు.

"అయినా పరవాలేదు" అన్నది పులి.

ఆశీర్వాదం ఆ చెట్టుకి జరిగిన సంగతంతా విన్నవించాడు. తానే విధంగా పెద్దపులి ప్రాణాలను రక్షించిందీ, ఇప్పుడా పులి తన ప్రాణాల నేవిధంగా తియ్యాలని కుతూహలపడుతూవుందీ నివేదించాడు. నివేదించి, "ఇది న్యాయమేనా?" అని అడిగాడు.

చెట్టు చెప్పింది–"నీ ఉద్దేశం నాకు అర్థమైంది. పెద్ద పులి నీకు కృతజ్ఞతచూపాలంటావు. అయితే నా కథ విను....నేనీ తోట కాపరికి ఎన్నో ఫలాల నిచ్చాను. నా ఫలాలను తనూ తన పిల్లలూ తిని ఆరోగ్యంగా వుండటమే కాకుండా,బజార్లో అమ్మి డబ్బు సంపాదించాడు యీ తోటమాలి. ఈ విధంగా దగ్గర దగ్గర పది సంవత్సరాలు నన్ను అనుభవించాడు.... ఇప్పుడు నేను ముసలిదాన్నయ్యాను ఫలాలను తోటమాలికి అందించలేక పోతున్నాను. అందుకని అతడేం చేస్తున్నాడో చూశావా? నాకు నీళ్ళుపట్టడు. ఎరువు వెయ్యడు. పైగా వంటకు కావలసినప్పుడల్లా నా కొమ్మలు నరుకు తున్నాడు....నేను వొకప్పుడు అతనికి సహాయం చేశాననే కృతజ్ఞత అతనికి వుందంటావా? కృతఘ్నులైన మనుష్యులపట్ల కృతజ్ఞత ఎందుకు చూపాలి? ఈ పెద్దపులి నిన్నెందుకు తినగూడదు?" అని ప్రశ్నించింది చెట్టు.

"బాగా చెప్పింది" అన్నది పెద్దపులి. అని లొట్టలు వేసుకుంటూ ముందుకు జరిగింది.

"ఆగు ఒక్కక్షణం ఆగు!! మనం ఇంకా ఇద్దరి ఉద్దేశాలు తెలుసుకోవాలి. మనం ముగ్గుర్ని అడుగుదాం అనుకున్నాం-మరచిపోకు" అన్నాడు.

"సరే అల్లాగే కానివ్వు....కాని ఆలస్యం అయినకొద్దీ నీ ఘుమఘుమలు ఎక్కువౌతున్నయి నాకు" అన్నది పులి.

ఇద్దరూ కలిసి ముందుకు సాగారు. కొంచెం దూరం వెళ్ళేటప్పటికి ఒక ముసలి దున్నపోతు కనిపించింది. పెద్దపులి ఆదేశానుసారం దాన్ని అడిగాడు అతను. అది కన్నీరు పెట్టుకుంటూ తన గాథను చెప్పింది.

"మనుష్యుడు 'కృతజ్ఞత' సంగతి ఏ మొహం పెట్టుక మాట్లాడుతాడో నాకు అర్థం కావటంలేదు....నేను మంచి వయస్సులో నా యజమాని దగ్గరకు వొచ్చాను. మంచి ఎద్దులు చెయ్యలేని పనులన్నీ చేశాను. ఇంటి కొండరాళ్ళు నేను తోలాను! పొలం నేను దున్నాను....బురదలో దుక్కి దున్నాను; నీళ్ళకు మోటలాగాను; నా యజమానికోసం నేను చెయ్యని పని లేదు....రాత్రింబగళ్ళు కష్టించి శరీరాన్ని కరిగించి యౌవనాన్ని ధారపోసి అతణ్ణి ధనవంతుణ్ణి చేశాను. నావల్ల అతను ఆస్తి అనేకరెట్లు పెరిగింది. కొడుకుని చదువుకి విదేశాలు పంపి, ప్రస్తుతం పెద్ద ఉద్యోగంలో చేర్పించాడు. ఊళ్లో ఒక మేడా టౌన్లో ఒక మేడా కట్టించాడు. కాలు క్రింద పెట్టకుండా కారుల్లో తిరుగుతున్నాడు....కాని తన ధనానికి భోగాలకూ కారణమయిన నా సంగతి యేమైనా ఆలోచిస్తున్నాడేమో చూశావా? నన్ను బయటకు తోలాడు....గాలికి బ్రతికి గాలికి వదులున్నాడు. నన్ను దావడిలో ప్రవేశించనివ్వడు. నాకు ఒక్క గడ్డిపరక వెయ్యనివ్వడు. "ఎందుకు దానికి దండుగ?" అంటాడు. ఈ లోకంలో కృతజ్ఞతకు యీ పెద్దపులి ఎందుకు కట్టుపడి వుండాలి?"

ఈ మాటలకు "చూశావా?" అని ఎగిరి గంతువేసింది పెద్దపులి. "ఇప్పుడేమంటావ్?" అని అడిగింది.

"ఇంకొక మధ్యవర్తి వున్నాడు....అతన్ని అడిగిం తర్వాత." అన్నాడు ఆశీర్వాదం. అన్నాడేగాని అతని ఆశలు అడుగంటినై. ప్రపంచం అంతా మనిషికి వ్యతిరేకమే" అనిపించింది అతనికి.

ఇంతలో వొక వృద్ధుడు ఎదురుగా రావటం చూసింది పులి. అతనికి గడ్డం పెరిగివుంది. వెంట్రుకలు జడలుకట్టుకొని వున్నయ్. ఆ అరణ్యంలో తపస్సు చేసుకునే మహర్షిలాగున్నాడు అతను.

ఆకలితో మలమల మాడుతున్న పులి, "అతణ్ని అడుగు" అన్నది. ఆశీర్వాదం ఆ వృద్ధునితో జరిగిన సంగతి అంతా చెప్పాడు. చెప్పి "మీ వుద్దేశం చెప్పండి—నేను చేసిన మేలును మరచిపోయి ఈ పులి నన్ను చంపటం ధర్మమేనా?" అని అడిగాడు.

ఆ వృద్ధుడు ఆశీర్వాదం చెప్పిందంతా శ్రద్ధగా విన్నాడు. ఆశీర్వాదాన్ని పెద్దపులిని పరిశీలనగా చూశాడు. పెద్దపులితో "మొదట్లో నిన్ను గోనెసంచిలో కుక్కటానికి ప్రయత్నించాడా?" అని అడిగాడు.

"అవును...." అన్నది పెద్దపులి.

"అందులో నువ్వు పట్టలేదా?" అని రెండో ప్రశ్న అడిగాడు.

"అవును. తలదూరిస్తే తోక మిగిలింది." అన్నది పులి.

"గోనెసంచిలో నువ్వు పట్టకపోవటం ఏమిటి?"

"పట్టలేదు." అన్నది పులి.

"నేను నమ్మను" అన్నాడు వృద్ధుడు.

ఈ మాటకు పెద్దపులికి కోపం వచ్చింది. "అయితే ప్రత్యక్షంగా చూడు." అని గోనెసంచిలోకి వెనుకగా దూరింది. తల మిగిలింది. "చూశావా?" అన్నది మిగిలిన తలతో.

"నేను నమ్మనిది తోక మిగిలిన సంగతి. ఎందుకంటే నీ తల

సంచిలో వున్నప్పుడు, సంచి బయట తోక మిగిలిందని నువ్వెట్లా చూడ గలిగావు?" అని అడిగాడు వృద్ధుడు.

"అయితే నువ్వేచూడు" అన్నది పెద్దపులి. అది గోనెసంచిలోకి ముందు తలనీ, నెమ్మదిగా శరీరాన్నీ దూర్చింది. వృద్ధుడు వెంటనే సంచి మూతిని బిగించి పట్టుకున్నాడు. "నీ దగ్గర మొనతేలిన కత్తివుందా?" అని అడిగాడు ఆశీర్వాదాన్ని.

"ఆఁ" అన్నాడు ఆశీర్వాదం.

"ఇంకేం?" అన్నాడు వృద్ధుడు.

"అయితే పెద్దపులిని పొడిచి చంపమంటారా?" అని ఆశ్చర్యంగా అడిగాడు ఆశీర్వాదం.

"నీ యిష్టం. దాన్ని చంపటమో, దానిచేతుల్లో చావటమో అది నీ యిష్టం." అన్నాడు వృద్ధుడు.

వెంటనే ఆశీర్వాదం మొలలోనుంచి బాకుని లాగాడు. గోనెసంచి లోకి శక్తికొద్దీ పొడిచాడు.

[చైనా కథకు అనుకరణ]